అద్దె భవనాలే దిక్కు

- నేటికీ సొంత భవనాలకు నోచుకోని ప్రభుత్వ కార్యాలయాలు
- విధులు నిర్వహించేందుకు ఉద్యోగుల పాట్లు
- ప్రజలకు సైతం తప్పని తిప్పలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు


పాఠశాల పాతభవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

మహమ్మదాబాద్: పాలనా సౌలభ్యం కోసం మండలాలను ఏర్పాటుచేసినా అక్కడ ప్రభుత్వ కార్యాలయాలకు అద్దె భవనాలే దిక్కు అయ్యాయి. మహమ్మదాబాద్ మండలం ఏర్పాటై నాలుగేళ్లు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. మండల పరిధిలో 22గ్రామ పంచాయతీలు మరో 15వరకు అనుబంధ గ్రామాలున్నాయి. మండల కేంద్రంలో ముఖ్యంగా తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం, విద్యాశాఖ, వ్యవసాయశాఖ, మహిళాసమాఖ్య భవనాలు ఏర్పాటు చేయాలి. ఏఒక్క కార్యాలయానికి కూడా పక్కాభవనాలు లేవు. కొన్ని కార్యాలయాలు అద్దె భవనాల్లో, మరి కొన్ని కార్యాలయాలు పాఠశాల పాత భవనాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయం పాఠశాల భవనంలో ఇరుకు గదుల్లో ఉండటంతో అవస్థలు పడుతున్నారు. ప్రజావాణి నిర్వహించేందుకు సైతం పాట్లు తప్పడంలేదు.

ఓపక్క కళాశాల.. మరోపక్క తహసీల్దార్..

మహమ్మదాబాద్ మండలానికి నూతనంగా ఇంటర్ కళాశాల మంజూరైంది. దీంతో శిథిలావస్థకు చేరిన పాఠశాల పాతభవనంలో ఓపక్క ఇంటర్ కళాశాల తరగతులు నిర్వహిస్తున్నారు. మరోపక్క తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేశారు. మరోపక్క మహిళా సమాఖ్య అద్దెభవనంలో నిర్వహిస్తూ ఇప్పటికే మూడు భవనాలు మార్చేశారు. 2020 సంవత్సరంలో కొత్త మండలం ఏర్పాటైనా ఇప్పటివరకు పక్కా భవనాలపై ఉన్నధికారులు దృష్టి సారించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఊసేలేని విద్యా, వ్యవసాయ శాఖల కార్యాలయాలు

మండలంలో విద్యా, వ్యవసాయ శాఖలకు కార్యాలయాలు లేవు. దీంతో అవసరాల కోసం వచ్చిన ప్రజలు, రైతులు అధికారులు ఎక్కడుంటే అక్కడికి వెళ్లి కలవాల్సి వస్తుంది. కార్యాలయాలు ఉంటే అధికారులు ఉంటారన్న నమ్మకం ఉండేది.

అధికారుల నిర్లక్ష్యమే కారణమా..



మండలం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తయింది. ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు పక్కాభవనాలు ఏర్పాటు చేయకపోవడం ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే కారణం. అద్దెగదుల్లో, పాత పాఠశాల భవనాల్లో ఉంటూ ఓవైపు అధికారులు మరోవైపు ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఊరటి అశోక్, మహమ్మదాబాద్

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలి



కొత్త మండలంలో అన్ని కార్యాలయా లు ఒకేచోట ఉండేలా అధికారులు ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపాలి. కార్యాలయాల భవన నిర్మాణాల కోసం చర్యలు తీసుకోవాలి.

శ్రీనివాస్, యువకుడు, మహమ్మదాబాద్

నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి
- బీసీ బాలికల గురుకులంలో తనిఖీలు
- అక్కడే రాత్రి బస


హన్వాడలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

హన్వాడ: విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. బుధవారం రాత్రి ఆమె హన్వాడలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. గురుకులంలోని పరిసరాలను, స్టోర్ రూం, కిచెన్‌రూం, కూరగాయలు భద్రపరిచే గదిని పరిశీలించారు. తాజా కూరగాయలతో వంటలు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి రాత్రి భోజనం చేశారు. నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారా? అంటూ వారిని అడిగి తెలుసుకున్నారు. 7వ తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. గురుకులంలోనే రాత్రి బస చేశారు. డీఆర్‌డీఓ నర్సింహులు, మహిళా శిశుసంక్షేమాధికారి జరీనాబేగం, భూగర్భజల వనరుల శాఖ డీడీ రమాదేవి, బీసీ సంక్షేమాధికారి ఇందిరా, మార్కెటింగ్ అధికారి బాలమణి పాల్గొన్నారు.

హుటాహుటిన కరెంట్ సరఫరా

కలెక్టర్ రాకకు ముందు గురుకులంలో అంధకారం నెలకొంది. శివాజీ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ర్యాలీలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు శివాజీ చిత్రపటానికి తగిలాయి. దీంతో కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది స్పందించి కలెక్టర్ వచ్చే లోపు కరెంట్ సరఫరాను అందించారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

నవాబుపేట: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తుందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద వేచి ఉన్న ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చాలామంది రేషన్‌కార్డులు, భూమి పాస్‌బుక్‌లో సర్వే నంబర్లు మిస్సింగ్ అంటూ సమస్యలు తెలపగా వాటిపై అధికారులతో మాట్లాడారు. వివిధ శాఖల అధికారుల సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి వందశాతం సర్వే పూర్తి కావాలన్నారు. వివిధ కార్యాలయాల సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆమె సూచించారు.


జడ్చర్లలో శివాజీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, తదితరులు


కోయిల్‌కొండ మండలం దమాయపల్లిలో..


దేవరకద్రలో శివాజీ చిత్రపటానికి..

యువతకు స్ఫూర్తి.. శివాజీ మహారాజ్

- ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు ఘన నివాళి
- పలు చోట్ల బైక్ ర్యాలీలు
- రక్తదానం చేసిన అభిమానులు, ప్రజలు


మహబూబ్‌నగర్‌లోని జై భీమ్ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: నేటి యువత ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను పురస్కరించుకొని ఘనంగా నివాళులర్పించారు. మహబూబ్‌నగర్‌లోని పాత పాలమూరు జైభీమ్ చౌరస్తాలో బహుజన మహనీయుల శోభాయాత్ర కమిటీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. పాతూరు రమేష్, సింగిరెడ్డి పరమేశ్వర్, ఆదిలక్ష్మయ్య పాల్గొన్నారు.

⇨ మహబూబ్‌నగర్ మండలంలోని గాజులపేటలో ఆగ్రామ యువకులు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

⇨ జడ్చర్లలోని హనుమాన్ దేవాలయం వద్ద శివాజీ విగ్రహానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పిచారు. రక్తదాన శిబిరంలో రక్తమిచ్చి ఎమ్మెల్యే ప్రారంభించారు. శివాజీ విగ్రహం వద్ద మాజీ మంత్రి డా.లక్ష్మారెడ్డి సైతం నివాళులర్పించారు. వీరశివాజీనగర్‌లో ప్రతిష్ఠించనున్న శివాజీ విగ్రహానికి ఎమ్మెల్యే, మాజీమంత్రి వేర్వేరుగా పూజలు చేశారు.

⇨ దేవరకద్రలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ఆవరణలో శివాజీ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. సుధాకర్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, రమేశ్, నిరంజన్, రఘువీర్, ప్రతాప్ పాల్గొన్నారు.

⇨ నవాబుపేట మండలంలో శివాజీ జయంతిని నిర్వహించారు. లోకిరేవు శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 149 మంది యువకులు రక్తదానంచేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. లింగం, రవికుమార్, శ్రీనివాస్, వినోద్, కుర్మయ్య, రాజు, చిరు, సురేందర్, జైపాల్, శ్రీశైలం, సంతోష్, శివ పాల్గొన్నారు.

⇨ కోయిల్‌కొండ మండలం దమాయపల్లిలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. యువకులు రక్తదానం శిబిరం నిర్వహించారు. యువకులు బైక్ ర్యాలీ చేపట్టారు.

⇨ మిడ్జిల్‌లో బస్టాండ్ నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రాజేశ్వర్, తిరుపతి, నరేష్‌నాయక్, అరవింద్, శేఖ ర్, వెంకట్‌రెడ్డి, శివశంకర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

⇨ కొకుంట్ల మండలం అప్పంపల్లి బస్టాండ్ సమీపంలోని శివాజీ విగ్రహానికి గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శంకర్, రాజు, అశోక్‌రెడ్డి, శ్రీగురురెడ్డి, అంజన్న పాల్గొన్నారు.

⇨ మహమ్మదాబాద్‌తో పాటు చౌదర్‌పల్లి, నంచర్ల గ్రామాల్లో యువకులు శివాజీ శోభాయాత్రను నిర్వహించారు. వేణుగౌడ్, హరి, కుర్వకృష్ణ, రాములు, దస్తయ్య, పవన్, ఈశ్వర్, విష్ణు పాల్గొన్నారు.

⇨ హన్వాడలో ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో శివాజీ జయంతిని నిర్వహించారు. ఎస్‌ఐ వెంకటేష్, మహేందర్, వేముల కృష్ణయ్య, షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపి మండల నాయకుడు రఘురాంగౌడ్ ఆధ్వర్యంలో పెద్దర్పల్లిలో క్రీడాపోటీలు నిర్వహించారు.

⇨ భూత్పూర్ మండలంలోని పోతులమడుగులో నరేష్‌చారి ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

⇨ దేవరకద్ర మండలం చిన్నరాజమూర్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌యాదవ్ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన శివాజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు.


కొకుంట్ల మండలం అప్పంపల్లిలో ..


నవాబుపేట మండలం లోకిరేవులో రక్తదానం చేస్తున్న యువకులు


మిడ్జిల్‌లో..

క్లుప్తంగా

సీఎం సభను విజయవంతం చేయాలి

కోయిల్‌కొండ: ఈనెల 21న నారాయణపేటలో జరిగే సీఎం సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జి.రవీందర్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు వై.విద్యాసాగర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరుకావాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, రవినాయక్, సత్యపాల్‌రెడ్డి, బండి యాదవ్‌కుమార్, రాజునాయక్, శేఖర్, రామస్వామి, నారాయణ, వెంకటయ్య పాల్గొన్నారు.

మెరుగైన విద్యా బోధన

మిడ్జిల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన విద్యా బోధన కొనసాగుతుందని అధ్యాపకులు చరణ్, అక్తర్, నవనీత అన్నారు. బుధవారం స్థానిక కేజీబీవీ, బోయిన్‌పల్లి ఉన్నత పాఠశాలలో పదో తగరతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కళాశాల ప్రత్యేకతలు, విద్యాబోధనను విద్యార్థులకు వివరించారు. బస్టాండ్ సమీపంలో అన్ని సౌకర్యాలతో కూడిన ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరారు. వారి వెంట ప్రత్యేకాధికారిణి కవిత, తదితరులు ఉన్నారు.

'కేంద్ర బడ్జెట్‌ను సవరించే దాకా పోరాడుతాం'

హన్వాడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించే దాకా పోరాడుతామని సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మయ్య హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో ఆపార్టీ నాయకులు బడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ కార్పొరేట్ సంస్థల కోసం ప్రవేశపెట్టినదిగా ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు బాలయ్య, వెంకటయ్య, శ్రీనాథ్, చెన్నయ్య పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

భూత్పూర్: సీఐటీయూ ఆధ్వర్యంలో భూత్పూర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వి. కురుమూర్తి ఆరోపించారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ వర్కర్లకు వేతనాలు చెల్లించలేదని, ప్రమాద బీమాతో పాటు, ఐడీ కార్డులు ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మహమ్మదాబాద్: అతివేగంగా వెళ్తున్న తుఫాన్ వాహనం ఓ బైక్‌ను ఢీకొట్టగా ఇద్దరు యువకులకు తీవ్రగాయాలైన ఘటన మహమ్మదాబాద్ మండలంలో చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని ముందలితండాకు చెందిన సాగర్, శ్రీధర్ బైక్‌పై మొకర్లాబాద్‌కు వెళ్లారు. తిరిగి తండాకు వెళ్తుండగా తాండూరు వైపు నుంచి శ్రీశైలానికి వెళ్తున్న తుఫాను వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

ఎంవీఎస్‌లో కొత్త కోర్సు ప్రారంభం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఐటీసీ, ఇన్ఫోసెస్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో 'ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లయబిలిటీ' కొత్త కోర్సును బుధవారం ప్రారంభించారు. ఈమేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు ఐటీ, ఇండస్ట్రీ వంటి సెక్టార్‌లో ఉద్యోగాలు పొందేందుకు ఈకోర్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈకోర్సులో ప్రతిసారి 65 మంది శిక్షణ ఇస్తామని, సర్టిఫికెట్‌ను కూడా అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు.

సంప్రదాయాలను మరవొద్దు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు సంప్రదాయాలను మరవొద్దని డీఐఈఓ కౌసర్ జహాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అక్షర కళాశాలలో ఫెస్ట్ 2025తో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఎంత ఎత్తుకు ఎదిగినా మన సంస్కృతి సంప్రదాయాలను మర్చిపోకుండా ఉండాలన్నారు. అప్పుడే మన గతం తెలుస్తుందని అన్నారు. ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని, సెల్‌ఫోన్‌లు సినిమాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎస్వీడీసీ కళాశాల డీన్ హీరోజీరావు బోస్లేం, అధ్యాపకులు విష్ణు, యాకుబ్, హరికృష్ణ పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్‌కుమార్


విద్యార్థులతో చదివిస్తున్న అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్‌కుమార్

కోయిల్‌కొండ: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గార్లపహాడ్ ఉన్నతపాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మరుగుదొడ్లు సరిగాలేవని తెలుసుకొని వెంటనే నిర్మించాలని సర్వశిక్షా అభియాన్ ఏఈ వెంకటేష్‌ను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థుల్లో పఠన సామర్థ్యాలను మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు అందించే పౌష్టికాహారం నాణ్యతతో ఉండేలా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీఈఓ ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, ఎంఈఓ వెంకట్‌జీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుష్టశక్తుల నుంచి నరసింహస్వామి కాపాడుతాడు

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్‌ను దుష్టశక్తుల నుంచి సింహగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి కాపాడుతూ ఈనగరాన్ని ప్రశాంతంగా ఉంచుతారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సింహగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం ప్రాంగణంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న శ్రీఆంజనేయస్వామి, శ్రీగరుత్మంతుడు, సుధామూర్తుల విగ్రహాల కోసం బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే శ్రీఆంజనేయస్వామి, శ్రీగరుత్మంతుడు, సుధామూర్తుల విగ్రహాలను వైభవంగా ప్రతిష్ఠించుకుంటున్నామన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ సుందరీకరణ కమిటీ అధ్యక్షులు పోల శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు అజ్మత్ అలీ, భాస్కర్, తిరుపతినాయక్, నర్సింలు, మల్లేష్, కృష్ణయ్య, రాఘవేందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

శివాజీ ఆశయాలను కొనసాగిద్దాం

ఛత్రపతి శివాజీ ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాల్కొండ చౌరస్తా బైపాస్ రోడ్డులో శివాజీవిగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

తుల్జాభవానికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


తుల్జాభవాని పూజలో పాల్గొన్న ఎమ్మెలే జి.మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్: మండలంలోని పోతులమడుగు గ్రామ పంచాయతీలోని సుక్యాతండాలో బుధవారం గిరిజనుల ఆరాధ్య దైవం తుల్జాభవాని వేడుకల్లో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హర్యానాయక్ ఇంట్లో ఈ వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మాసగౌడ్, మాజీ ఎంపీటీసీ లాలూనాయక్, బాలవర్ధన్‌రెడ్డి, బాబు, లిక్కి విజయ్‌గౌడ్ తదితరులున్నారు.

వివరాలను సిద్ధం చేయండి

దేవరకద్ర: మంత్రి పర్యటన సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించి వ్యవసాయ శాఖ అన్ని వివరాలు సిద్ధంగా ఉంచాలని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ, మార్కెటింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఈనెల 22న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పర్యటన ఉందన్నారు. వ్యవసాయశాఖకు సంబంధించిన అవసరాలపై నివేదికలు రూపొందించాలని కోరారు.

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు.

దేవరకద్ర రూరల్: మండలంలోని చిన్నరాజమూర్‌లో రూ.22 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు పనులకు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి శంకస్థాపన చేశారు. అడవి అజిలాపూర్‌లో నూతనంగా నిర్మించిన యాదవ కమిటీ భవనం, ఆంగన్‌వాడీ భవనం నిర్మాణ పనులకు సైతం శంకుస్థాపన చేసి మాట్లాడారు. నాగన్నపల్లిలో పార్టీ జెండాను అవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మికాంత్‌రెడ్డి, నాయకులు భరత్‌కుమార్, నర్సింహారెడ్డి, మైబు, మాజీ ఎంపీటీసీ సుగణమ్మ, గోవర్ధన్, గోపాల్, అన్వేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి

డీఎంహెచ్‌ఓ డా.కృష్ణ


యన్మన్‌గండ్ల వెల్‌నెస్ కేంద్రం పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డా.కృష్ణ

నవాబుపేట: వెల్‌నెస్ కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని, అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డా.కృష్ణ ఆదేశించారు. బుధవారం మండలంలోని యన్మన్‌గండ్ల హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. సమయ పాలనతో పాటు ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్నిరకాలు మందులు అందించాలన్నారు. ప్రభుత్వం ద్వారా కొనసాగుతున్న వెల్‌నెస్ కేంద్రంలో అన్నిరకాల సదుపాయలు ఉన్న విషయం ప్రజలు తెలిసేలా చూడాలన్నారు. ఆయన వెంట డా.శ్రావణ్ తదితరులు ఉన్నారు.

సబ్‌ప్లాన్ ప్రత్యేక నిధులతో అభివృద్ధి

పరిగి ఎమ్మెల్యే డా.టీ.రామ్మోహన్‌రెడ్డి


రంగారెడ్డిపల్లిలో సీసీరోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండేడ్: ఎస్సీ ఎస్టీ కాలనీల్లో సబ్‌ప్లాన్ ప్రత్యేకనిధులతో గ్రామాలు అభివృద్ధి చేస్తున్నట్లు పరిగి ఎమ్మెల్యే డా.టీ.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రంగారెడ్డిపల్లి, చిన్నవార్వల్, జక్లపల్లి, రుసుంపల్లి గ్రామాల్లో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో సీసీరోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. రుసుంపల్లి గ్రామ పంచాయతీ భవనాన్ని, పెద్దవార్వాల్‌లో పశువైద్యశాలను ప్రారంభించారు. పెద్దవార్వాల్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, డీసీసీ నాయకుడు నర్సింహారావు, ఎంపీడీఓ దేవన్న, తహసీల్దార్ నాగలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, పుల్లారెడ్డి, బాలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బాలస్వామి, చిన్నయ్య, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా మునిరంగస్వామి శకటోత్సవం


శకోత్సవంలో పాల్గొన్న వాహనాలు

భూత్పూర్: పట్టణంలోని శ్రీమునిరంగస్వామి శకటోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చన చేశారు. వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ రకాల తినుబండారాలు, వివిధ దుకాణాలు వెలిశాయి. జాతరలో భాగంగా దేవాలయ కమిటీ సభ్యులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జాతరలో తీన్‌పత్తా ఆటను సైతం ఆడుతున్నారు. యువకులు తీన్‌పత్తాపై మొగ్గు చూపుతున్నారు.

పాద పూజోత్సవం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో బుధవారం మాతృ, పితృ పాద పూజోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని శిశుమందిరం పాలమూరు క్లైనిక్ ప్రముఖ్ కంఠ కృష్ణమోహన్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం తల్లిదండ్రుల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. 25మంది దంపతులకు వారి పిల్లల తో పాదపూజ చేయించారు. వేడుకల్లో శిశుమందిరం ప్రముఖులు సుధాకర్‌రెడ్డి, రాములకృష్ణ, గంధంజ్యోతి, గుబ్బ అశోక్, వెంకటయ్య, రాధాకృష్ణ పాల్గొన్నారు.